అమ్మఒడి ఘనత వైఎస్ జగన్‌దే

- కూటమి ప్రభుత్వం.. కుట్రల సర్కారు
- ప్రజల ఆస్తుల్ని అమ్మితేనే పథకాలు అమలు చేస్తారా?
- కొండల్ని దోచుకోవడం యలమంచిలిలోనే చూస్తున్నాం..
- వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



సమావేశంలో మాట్లాడుతున్న కరణం ధర్మశ్రీ, వేదికపై కన్నబాబురాజు, బొడ్డేడ ప్రసాద్, తదితరులు

మునగపాక(అచ్యుతాపురం): విద్యార్థులకు అండగా ఉండాలన్న ఉద్దేశంతో అమ్మఒడి పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఆ పార్టీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా మునగపాక మండల కేంద్రంలోని రాహుల్ గాంధీ కల్యాణ మండపంలో మంగళవారం మండల స్థాయి వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీల కోసం మడమ తిప్పని నేతగా వైఎస్ జగన్ గుర్తింపు పొందారని కొనియాడారు. హామీలు అమలు చేయకుండా ఏడాదికి పైగా కూటమి ప్రభుత్వం తాత్సారం చేస్తోందని, కుట్రల ప్రభుత్వంగా ఈ సర్కారును అభివర్ణించవచ్చునన్నారు. సంపద సృష్టిస్తామని చెప్పిన సీఎం చంద్రబాబు ప్రజల ఆస్తుల్ని అమ్మేసేలా పాలన సాగిస్తున్నారని విమర్శించారు. దీనికి ఉదాహరణ విశాఖలో ఎకరా వంద కోట్లు రూపాయలు విలువ చేసే భూముల్ని లులూ సంస్థకు ఎకరా 11 రూపాయిలకే లీజుకివ్వడమన్నారు. ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీల అమలు బాధ్యత ప్రతిపక్షంగా తమపై ఉందని స్పష్టం చేశారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసే క్రమంలో ఒక పథకానికి రాష్ట్రాన్ని అమ్మేయాలని ఓ మంత్రి చేసిన వ్యాఖ్యలు చూసి రాష్ట్ర ప్రజలు మోసపోయామని గుర్తించారని తెలిపారు. రైతులంటే బాబుకి ఇష్టం ఉండదని ఆరోపించారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ ప్రభుత్వానికి ఒక వారంటీ లాంటిదని చలోక్తి విసిరారు. పార్టీ కార్యకర్తల్ని ఎంపీటీసీలుగా, జెడ్పీటీసీలుగా, సర్పంచ్‌లుగా గెలిపించుకుంటామని తెలిపారు. కూటమి నేతల దోపిడీ, అరాచకాల వల్లే ప్రజల్లో వైఎస్సార్‌సీపీకి ఆదరణ పెరుగుతోందన్నారు. యలమంచిలి నియోజకవర్గం దోపిడీకి అడ్డాగా మారిందని విమర్శించారు. గతంలో నీరు చెట్టు కింద టీడీపీ అవినీతి చేస్తే ఇక్కడి నియోజకవర్గంలో కొండలు తవ్వి దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు.

టీడీఆర్‌లు ఇస్తే సహించం

అనకాపల్లి–అచ్యుతాపురం రోడ్డు విస్తరణలో భాగంగా నిర్వాసితులకు టీడీఆర్ బాండ్లు ఇవ్వడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని ధర్మశ్రీ స్పష్టం చేశారు. పరిహారం ఇస్తేనే రోడ్డు విస్తరణ పనులకు సమ్మతిస్తామని తెలిపారు. చెరకు రైతులుండే మునగపాక మండల ప్రజలకు కూటమి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. వచ్చేనెల 8, 9, 10 తేదీల్లో మునగపాకలో రచ్చబండ నిర్వహించి ప్రజల సమస్యలపై పోరాటం, హామీల అమలుకు డిమాండ్లు చేస్తామన్నారు. పార్టీ మండల సమావేశానికి రెండు వేల మందికి పైగా కార్యకర్తలు హాజరయ్యారంటే కూటమిపై ఎంత వ్యతిరేకత ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు.

రాష్ట్రాన్ని అమ్మడానికి మీరెవరు?: మాజీ ఎమ్మెల్యే కన్నబాబు రాజు

హామీల అమలు కోసం రాష్ట్రాన్ని అమ్మేయాలని మంత్రి వ్యాఖ్యానించడాన్ని మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని అమ్మడానికి మీరెవరని ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ ఉలుకు.. పలుకు లేకుండా ఎందుకుంటున్నారో అర్థం కావడం లేదని ఆక్షేపించారు. తిరుపతిలో లేనిపోని నెయ్యి స్కామ్ అంటూ చెప్పి మౌన వ్రతం చేసిన పవన్.. ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న అడ్డగోలు పాలన, దోపిడీపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. తల్లికి వందనం పథకం కింద 30 శాతం మందికే నిధులు విడుదల చేశారన్నారు.

కొత్త పెన్షన్ అందాలంటే ఎవరైనా చనిపోవాలా? : బొడ్డేడ

కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందాలంటే చాలా దయనీయమైన పరిస్థితి ఉందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ అన్నారు. కొత్తగా ఎవరికైనా పెన్షన్ రావాలంటే ఇప్పుడు లబ్ధిదారుల్లో ఎవరైనా చనిపోవాలా? అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో నేతలు ఎటువంటి గ్రూపులు లేవని ఉద్ఘాటించారు. ముందుగా మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించిన తర్వాత సమావేశాన్ని ప్రారంభించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఆడారి అచ్చింనాయుడు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో జెడ్పీటీసీ పెంటకోట సోమ సత్యనారాయణ, పార్టీ నాయకులు షేక్ ఇస్మాయిల్, దాసరి అప్పారావు, కాండ్రేగుల నూకరాజు, బొద్దపు శ్రీరామమూర్తి, దొడ్డి వర, కాండ్రేగుల జగన్, సూరిసెట్టి రాము, ఇల్లా నాగేశ్వరరావు, సుందరపు తాతాజీ, పిట్టా మంగరెడ్డి, చదరం నాయుడు, దిమ్మల అప్పారావు, నరాలశెట్టి సూర్యనారాయణ, గంగ అప్పలనాయుడు, త్రిమూర్తులు, బొడ్డేడ శ్రీను, చందు, బుజ్జి, రామ్మోహన్‌రావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

'స్మార్ట్ మీటర్లతో అదనపు భారం'



స్మార్ట్ మీటర్లు వద్దంటూ కరపత్రాలు ప్రదర్శిస్తున్న తిమ్మరాజుపేట వాసులు

అచ్యుతాపురం: అదానీ స్మార్ట్ విద్యుత్ మీటర్లను ఇళ్లకు, అపార్టుమెంట్లకు బిగించకుండా అడ్డుకోవాలని సీఐటీయూ, రైతు సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు స్మార్ట్ మీటర్ల కలిగే ఇబ్బందులను వివరిస్తూ మంగళవారం తిమ్మరాజుపేటలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు కర్రి అప్పారావు, సీఐటీయూ నాయకుడు ఆర్.రాములు మాట్లాడుతూ ఇప్పటికే రూ.200, రూ.300 వచ్చే విద్యుత్ చార్జీలు ఇటీవల కాలంలో రూ.1000 నుంచి రూ.2 వేలకు చేరిందన్నారు. స్మార్ట్‌మీటర్లను బిగించుకుంటే ముందుగా ప్రీపెయిడ్ చార్జ్ చేస్తేనే విద్యుత్ వస్తుందని, అది కూడా సమయాన్ని బట్టి ధరలు మారుతాయని పేర్కొన్నారు. అంతే కాకుండా విద్యుత్ మీటర్ల బిగింపు కోసం భారీగా చార్జీలు విధించి, నెలవారీగా వసూలు చేస్తారని తెలిపారు. స్మార్ట్ మీటర్లతో ప్రజలకు అదనపు భారం తప్పదని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శరగడం రామునాయుడు, నడుపూరి సన్యాసిరావు, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈ నెలాఖరు వరకు ఇంటర్ ప్రవేశాలకు గడువు

కోటవురట్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు ఈ నెలాఖరు వరకు గడువున్నట్టు ప్రిన్సిపాల్ ఎ.ఆర్.టి.సుజాత తెలిపారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాణ్యమైన విద్య అందుతోందన్నారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధతో మెరుగైన ఫలితాలను సాధిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, భోజన సదుపాయం ఉన్నాయని, వీటితో పాటు ప్రభుత్వం అందిస్తున్న తల్లికి వందనం పథకానికి కూడా అర్హులుగా పేర్కొన్నారు. ఇప్పటి వరకు 138 మంది విద్యార్థులు కళాశాలలో చేరినట్టు తెలిపారు.

పీహెచ్‌సీకి వాటర్ ప్యూరిఫైర్ వితరణ

పాయకరావుపేట: పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో దాసరి నేస్తాలు, జయలక్ష్మి దంపతుల సహాయంతో సుమారు రూ.20 వేలు విలువ చేసే వాటర్ ప్యూరిఫైర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ చేస్తున్న సేవలను డాక్టర్ సుభాష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ సత్యనారాయణ, సెక్రటరీ వాసు, కోశాధికారి ప్రదీప్, సభ్యులు కట్టమూరి నూకరాజు, దాసరి రాజ్‌కుమార్, తాతాజీ, వెంకటేష్, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నీటి తీరువా వసూళ్లకు సహకరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ మహేశ్వరరావు

పాయకరావుపేట: గ్రామంలో రైతుల వద్ద నుంచి సాగునీటి తీరువా వసూళ్లకు సహకరించాలని తహసీల్దార్ ఎస్.ఎ.మహేశ్వరరావు కోరారు. మండల రెవెన్యూ కార్యాలయంలో సాగునీటి సంఘాల చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లతో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగునీటి తీరువా వసూలు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆయా గ్రామాల వీఆర్‌వోలు పాల్గొన్నారు.

పరిశుభ్రతను పాటించండి



రామచంద్రపాలెంలో డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల: పారిశుద్ధ్యం మెరుగుకు ప్రతి ఒక్కరూ దోహదపడాలని ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. ఐవీఆర్ఎస్ గ్రామాలు జల్లూరు, రామచంద్రపాలెంలో ఎంపీడీవో మంగళవారం పర్యటించారు. వీధుల్లో తిరిగి కాలువలు, మంచినీటి పథకాలను పరిశీలించారు. మంచినీటి నమూనా సేకరించి పరీక్ష కోసం ల్యాబ్‌కు పంపించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ఎక్కువగా వ్యాపిస్తున్నాయని, పరిశుభ్రత పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. చెత్తను వీధుల్లో ఇష్టానుసారం వేయకుండా పారిశుద్ధ్య కార్మికులకు అప్పగించాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పీజీఆర్ఎస్ ఫిర్యాదుపై విచారణ



పీజీఆర్ఎస్ ఫిర్యాదుపై విచారణ చేపడుతున్న తహసీల్దార్ రమేష్‌బాబు

ఎస్.రాయవరం: అత్తా కోడళ్ల మధ్య ఉన్న భూసమస్య పీజీఆర్ఎస్ ఫిర్యాదు ద్వారా పరిష్కారం కాదని, గ్రామ పెద్దలు, కోర్టును ఆశ్రయించి పరిష్కరించుకోవాలని తహసీల్దార్ రమేష్‌బాబు సూచించారు. సైతారుపేట గ్రామంలో పీజీఆర్ఎస్ దరఖాస్తుపై మంగళవారం సైతారుపేట గ్రామానికి తహసీల్దార్ వెళ్లి పరిశీలించారు. సమస్యను గ్రామ పెద్దల మధ్య పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



ఆకుమడిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మునగపాక: వరి సాగులో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని శాస్త్రవేత్తలు రమణమూర్తి, పద్మావతి, రాజ్‌కుమార్ కోరారు. మండలంలోని వాడ్రాపల్లిలో మంగళవారం వారు నారుమడులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరిలో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చన్నారు. విత్తన శుద్ధిపై అవగాహన పెంచుకోవాలన్నారు. వీఏఏలు లక్ష్మి, సింధూజ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాలకు సత్కారం



చిక్కాలను సత్కరిస్తున్న సర్పంచ్‌లు

ఎస్.రాయవరం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా చిక్కాల రామారావును నియమించడం హర్షణీయమని ఎస్.రాయవరం మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు పాయకరావుపేట మండలం పెంటకోట గ్రామంలో చిక్కాలను మంగళవారం కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు మైలపల్లి శ్రీనివాసరావు, వైబోయిన సత్యనారాయణ, ఎంపీటీసీ నాగంబోయిన శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలి



మండల పరిషత్ పాలక వర్గానికి వినతిపత్రం అందిస్తున్న వీసం రామకృష్ణ, అప్పలరాజు

నక్కపల్లి: మండలంలో బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటుకు సంబంధించి వచ్చే నెల 6న నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని కోరుతూ మండల పరిషత్‌లో తీర్మానం చేయాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వీసం రామకృష్ణ, సీపీఎం జిల్లా నాయకుడు ఎం.అప్పలరాజు, పలువురు రైతులు మండల పాలకవర్గ సభ్యులను కోరారు. మంగళవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో నిర్వాసిత గ్రామాలకు చెందిన రైతులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎంపీపీ ఏనుగుపల్లి రత్నంకు వినతిపత్రం ఇచ్చారు. అత్యంత ప్రమాదకరమైన బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటు చేయడాన్ని ఈ ప్రాంత ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. ఇప్పటికే ఈ పార్క్ కోసం 2 వేల ఎకరాలు కేటాయించారని, భూములు ఇచ్చిన రైతులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అందలేదన్నారు. ఈ సమస్యల కోసం రైతులు ఏడాది నుంచి ఆందోళన చేస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించకపోగా అదనపు భూసేకరణ పేరుతో పెదతీనార్ల, సీహెచ్ఎల్ పురంలో సుమారు 800 ఎకరాలు సేకరించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారన్నారు. అదనంగా భూములు ఇచ్చేందుకు రైతులు సిద్ధంగా లేరన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తే అఖిల పక్షాల తరపున అడ్డుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు తాళ్ల రోహిణీ భార్గవ్, వెదుళ్ల రమణ, ఎంపీటీసీలు గొర్ల గోవిందు, నిట్ల గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

సత్యవరంలో 'పొలం పిలుస్తోంది'



పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

పాయకరావుపేట: మండలంలోని సత్యవరం గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్ర సందర్శన అనంతరం రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం వరి నారుమడిలో తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఏఆర్ఎస్ అనకాపల్లి సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.రవిబాబు, బీసీటీ కేవీకే శాస్త్రవేత్త శ్రీహరి, డీఆర్‌సీ ఏవో తులసి, రైతులు పాల్గొన్నారు.

పాడి రైతులకు బేసిన్ల పంపిణీ



పాడి రైతులకు బేసిన్లు అందిస్తున్న విశాఖ డెయిరీ జోనల్ కార్యాలయ మేనేజర్ రమణ

మునగపాక: విశాఖ డెయిరీ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జోనల్ కార్యాలయ మేనేజర్ శరగడం రమణ కోరారు. మండలంలోని మూలపేట పాల సంఘ ఆవరణలో మంగళవారం పాడి రైతులకు విశాఖ డెయిరీ ద్వారా బేసిన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడిరైతుల సంక్షేమమే ధ్యేయంగా సేవలందిస్తున్నామన్నారు. పాల సంఘ డైరెక్టర్లు బొడ్డేడ మహేశ్వరరావు, ఆడారి కాశీ శ్రీనివాసరావు, కాండ్రేగుల చిన్న శ్రీనివాసరావు, కొయిలాడ రమణబాబు, భీశెట్టి మురళి, తదితరులు పాల్గొన్నారు.

సీసీఎల్‌సీ కార్డుదారులకు రుణ సదుపాయం కల్పించాలి



మునగపాక ఎస్‌బీఐ మేనేజర్‌తో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

మునగపాక: సీసీఎల్‌సీ కార్డులున్న రైతులకు రుణాలు అందించేలా చూడాలని జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు కోరారు. మంగళవారం ఆయన మునగపాక ఎస్‌బీఐ మేనేజర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది రైతులు ఎన్‌పీసీఐ లింక్ చేసుకోలేదన్నారు. అటువంటి వారిని గుర్తించి లింక్ చేసుకునేందుకు సహకరించాలన్నారు. అనంతరం మునగపాక రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి రైతులకు ఎరువులు ఎంతమేర అందించారో అడిగి తెలుసుకున్నారు. మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం 2023–24 విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని ఉత్తరాంధ్ర చర్చా వేదిక పట్టణ ప్రతినిధి రాజేష్ ఒక ప్రకటనలో కోరారు. కూటమి అధికారం చేపట్టి 14 నెలలు కావస్తున్నా బకాయిలను రిలీజ్ చేయలేదన్నారు. యాజమాన్యాలు తల్లిదండ్రుల దగ్గర వసూలు చేసి సంవత్సరం అవుతుందన్నారు. తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని కోరారు.

కొండలు కనుమరుగు.!

- హోంమంత్రి ఇలాకాలో ఆగని దందా
- గ్రావెల్ అక్రమ తవ్వకాలతో తరిగిపోతున్న కొండలు
- ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి



అక్రమ తవ్వకాలతో సగం తరిగిపోయిన చినబొడ్డేపల్లిలోని కొండ



అక్రమ తవ్వకాలతో తరిగిపోయిన కొండ

కోటవురట్ల: అది హోం మంత్రి వంగలపూడి అనిత ఇలాకా.. అనంతమైన ప్రకృతి సంపదకు ఆ నియోజకవర్గంలోని నాలుగు మండలాలు పోటీ పడతాయి.. ప్రభుత్వ ఖజానాకు బోలెడంత ఆదాయాన్ని ఇచ్చే వనరులు ఇక్కడే ఉన్నాయి. కానీ ఆ వనరులన్నీ అక్రమార్కుల జేబులోకే వెళుతున్నాయి. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచితం పాలసీ ఆ పార్టీ నాయకులకు సంపదను సృష్టిస్తోంది. ఇసుక, గ్రావెల్ అక్రమ తవ్వకాలతో తమకు తామే సంపదను సృష్టించుకుంటున్నారు. ప్రకృతి సంపదను ఇష్టానుసారంగా తవ్వేసి మనల్ని ఎవర్రా ఆపేదంటూ రొమ్ము విరుస్తున్నారు. అధికారులు సైతం కళ్ల ముందు భారీ స్థాయిలో దోపిడీ జరుగుతున్నా కళ్లు మూసుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలో వరాహనదిలో ఇసుక, చుట్టూ ఉన్న కొండలు అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్నాయి. అక్రమార్కులు జంకూ బొంకూ లేకుండా తమకు మంత్రి అండదండలు ఉన్నాయంటూ బాహాటంగానే చెబుతూ దోపిడీకి పాల్పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మండలంలో వరాహనదిలో ఇసుక అక్రమ తవ్వకాలు, కొండలపై గ్రావెల్ తవ్వకాలకు అంతే లేకుండా పోయింది. ఇసుక దోపిడీతో ఓ టీడీపీ నేత ఇప్పటికే రూ.కోటి గడించగా, శివారు గ్రామంలోని ఓ టీడీపీ నేత కొండలను గుల్ల చేసి తానూ రూ.కోటి దాటేయ్యాలని పోటీ పడుతూ శ్రమిస్తున్నాడు. ఏడాదిగా కొండలను పొక్లెయిన్‌తో తవ్వేసి, ట్రాక్టర్లతో తరలించి వ్యాపారం చేస్తున్నాడు. ఇంత జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖాధికారులు పట్టించుకోకపోవడం దారుణం. చినబొడ్డేపల్లి రెవెన్యూ పరిధిలో నాలుగు కొండలపై గ్రావెల్ తవ్వకాలు భారీగా జరుగుతున్నాయి. రెడ్డి కొత్తూరుకు చెందిన ఓ టీడీపీ నేత తన సొంత పొక్లెయిన్, ట్రాక్టర్లతో గ్రావెల్ దందా సాగిస్తున్నాడు. ఇక్కడ సగానికి తరిగిపోయిన కొండలే ప్రత్యక్ష సాక్షులుగా కనిపిస్తున్నాయి. ఎంతో విలువైన ప్రకృతి సంపద నానాటికి తరిగిపోతోంది. ఉన్నతాధికారులు స్పందించకపోతే అక్కడ కొండలు ఉన్న జాడలు కూడా కనిపించవని మండల ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు.

మోదకొండమ్మ తల్లి గుడికి విరాళం



విరాళం అందిస్తున్న శ్రీధర్మ ఫౌండేషన్ చైర్మన్ సాయికృష్ణ

మునగపాక: స్థానిక బైపాస్ రోడ్డులో నిర్మిస్తున్న మోదకొండమ్మ తల్లి ఆలయ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పలువురు భక్తులు తమవంతు సాయం అందజేస్తున్నారు. దీనిలో భాగంగా మునగపాకకు చెందిన శ్రీధర్మ ఫౌండేషన్ చైర్మన్ కర్రి సాయి కృష్ణ మంగళవారం రూ.50 వేల నగదును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



రెవెన్యూ అధికారులు పట్టుకున్న ట్రాక్టర్లు

అచ్యుతాపురం: మండలంలోని దోడపల్లి నుంచి కొండకర్లకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. అనంతరం వాటి ని పోలీసులకు అప్పగించారు.

కౌలు వేలం వాయిదా

కశింకోట: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ భూములను కౌలుకు ఇవ్వడం కోసం మంగళవారం నిర్వహించిన వేలం పాట వాయిదా పడింది. ఆలయ ఈవో సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ ఆలయానికి సంబంధించి వెదురుపర్తి, కాశీపాలెం (అచ్యుతాపురం మండలం) గ్రామాల్లో భూములను కౌలుకు ఇచ్చేందుకు వేలం పాట ఏర్పాటు చేశారు. అయితే రైతులు ఎక్కువ మంది రాకపోవడంతో వాయిదా వేశారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి



సత్తిబాబు (ఫైల్)

కశింకోట: మండలంలోని విసన్నపేట గ్రామంలో మంగళవారం సాయంత్రం ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందాడు. గ్రామ సమీపంలోని పొలంలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతుండగా ప్రమాదవశాత్తు బోల్తా పడింది. దీంతో దాని డ్రైవర్ కన్నంరెడ్డి సత్తిబాబు (39) తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని స్థానికులు తెలిపారు. ఈ విషయమై ఫిర్యాదు అందినట్లు ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. మృతునికి భార్య మోహిని, పాప, బాబు ఉన్నారు.

పాత పద్ధతిలోనే దమ్ములు

మాడుగుల : గత 20 ఏళ్ల క్రితం గ్రామీణ ప్రాంతంలో రైతులందరూ కాడెడ్లుతో దుక్కులతో పాటు దమ్ములు చేసేవారు. ఆ తర్వాత రైతులందరూ యంత్రాలపై ఆధారపడేవారు. మండలంలో వొమ్మలి, జేడీపేట, ఎం. కోడూరు, శంకరం, తాటిపర్తి, తదితర గ్రామాల్లో 50 శాతం మంది రైతులు పశువులతోనే దమ్ములు చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల దిగుబడులు బాగా వస్తాయని, రైతులు చెబుతున్నారు.

చిత్తశుద్ధితో పని చేసిన ఉద్యోగులకు గుర్తింపు



సర్వసిద్ధిలో సచివాలయ ఉద్యోగులను సత్కరిస్తున్న తహసీల్దార్ రమేష్‌బాబు, ఎంపీడీవో సత్యనారాయణ



చూచుకొండలో సచివాలయ ఉద్యోగులను సత్కరిస్తున్న నాయకులు

ఎస్.రాయవరం: ఉద్యోగులు ప్రజల సమస్యలను చిత్తశుద్ధితో సకాలంలో పరిష్కరిస్తే గుర్తింపు లభిస్తుందని తహసీల్దార్ జె.రమేష్‌బాబు అన్నారు. సర్వసిద్ధి సచివాలయంలో సర్పంచ్ గణేశ్వరరావు అధ్యక్షతన ఇటీవల బదిలీ అయిన సచివాలయ ఉద్యోగులను మంగళవారం తహసీల్దార్ రమేష్‌బాబు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో సత్యనారాయణ ఘనంగా సత్కరించారు. ఉద్యోగులుగా విధులు ఎక్కడ నిర్వహించినా చిత్తశుద్ధితో చేసి సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ సూచించారు. అనంతరం బదిలీ అయిన 8 మంది సచివాలయ ఉద్యోగులు వెంకటేష్, శైలేంద్ర, దినకర్, ప్రసాద్, రాజేశ్వరి, పెప్సిబా, వరుణలను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామలక్ష్మి, గ్రామస్తులు పడమట సతీష్, కాసెపు అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

మునగపాక: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులకు తగిన గుర్తింపు ఉంటుందని చూచుకొండ సర్పంచ్ దొడ్డి సూరప్పారావు, ఎంపీటీసీ కాండ్రేగుల కిరణ్‌కుమార్ కొనియాడారు. చూచుకొండ సచివాలయంలో సేవలందించి బదిలీపై వెళ్లిన ఉద్యోగులను మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి వచ్చాక ప్రజలకు సకాలంలో సేవలందుతున్నాయన్నారు. మాజీ ఎంపీటీసీ పెంటకోట అప్పలనాయుడు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నారాయణపురంలో ధర్మశ్రీ పర్యటన



నారాయణపురం నాయకులతో సమావేశమైన కరణం ధర్మశ్రీ

రాంబిల్లి(అచ్యుతాపురం): సంస్థాగతంగా బలపడేందుకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వకర్త కరణం ధర్మశ్రీ అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే పలువురు సీనియర్ నేతల్ని, సీనియర్ సిటిజన్స్‌ను కలిసి మద్దతు కోరుతున్న ఆయన మంగళవారం మామిడివాడ పంచాయతీ శివారు నారాయణపురానికి చెందిన పలువుర్ని కలిసి మద్దతు కోరారు. కలిదిండి జయంతి బాబు, రిటైర్డ్ హెడ్ మాస్టర్ చింతలపాటి రాజు, రిటైర్డు ఫీల్డ్ ఆఫీసర్ చంటిబాబు, కృష్ణంరాజులను కలిసి కష్ట సుఖాలు పంచుకున్నారు. నియోజకవర్గ సమన్వకర్తగా నియమితులైన తనకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెట్టెం సత్యనారాయణ, బొడ్డేడ నాయుడు, పప్పల కోటేశ్వరరావు పాల్గొన్నారు.